క్లుప్తంగా

మన్నవలో 'పొలం పిలుస్తోంది'

పొన్నూరు: మండలంలోని మన్నవ, దొప్పలపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు రామ కోటేశ్వరి పాల్గొని రైతులకు భూసార పరీక్షలను అనుసరించి ఎరువులను ఎలా వినియోగించాలనే విషయాలను వివరించారు. ఏవో ఆర్.వెంకటేశ్వరావు పంట బీమా ప్రయోజనాలు వివరించి, రైతులు తప్పకుండా పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఐ.శ్రీకాంత్, సిబ్బంది ఎస్కే షరీఫా, రేష్మ ఎస్.సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



పెదకాకాని: రైతులకు సబ్సిడీపై ఇచ్చే వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రమణకుమార్ అన్నారు. పెదకాకాని మండల పరిధిలోని వెంకటకృష్ణాపురం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచి ధూళిపాళ్ల వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఏట పలువురు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, వీఏఏ భానుమతి, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి గరువుపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు సోమవారం రాత్రి మరణించినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. జూన్ 28వ తేదీన వడ్లమూడి గరువుపాలెం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో యువకుడికి తీవ్రంగా గాయపడ్డాడు. యువకుడిని 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు అక్కడి నుంచి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ యువకుడు మరణించాడు. సుమారు 33 ఏళ్ల ఉంటాయని.. ఆచూకీ తెలిసిన వారు చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ డి.వెంకట కృష్ణ తెలిపారు. ఘటనపై చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

త్వరలో వెండింగ్ జోన్‌లు



నెహ్రూ నగర్: నగరంలో వీధి వ్యాపారుల కోసం వెండింగ్ జోన్‌లు త్వరలో ఏర్పాటు చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నగరంలో వెండింగ్ జోన్‌ల ఏర్పాటు చేసేందుకు వెండింగ్ జోన్‌ల కమిటీ సభ్యులతో కలసి నగరంలోని పట్టాభిపురం, కంకరగుంట, గుజ్జనగుండ్ల, జె.కె.సి. కాలేజి రోడ్డు, ఆర్టీఓ ఆఫీస్ రోడ్డు తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వీధి వ్యాపారుల గుర్తింపు ప్రక్రియ పూర్తికావచ్చిందని, త్వరలోనే గుర్తించిన వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డుల జారీ చేసి వెండింగ్ జోన్‌లలో స్థలాలను కేటాయిస్తామన్నారు. పర్యటనలో వెండింగ్ జోన్ల కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, బొడ్డుపల్లి స్మిత పద్మజ, సంకూరి శ్రీనివాసరావు, షేక్ మీరవలి, ట్రాఫిక్ సీఐ సింగయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఈ.ఈ. సుందర రామి రెడ్డి, స్ట్రీట్ వెండర్స్ తలార్, నరసింహారావు, ఉపా సెల్ పీఓ రామారావు పాల్గొన్నారు.

4న విజయవాడ ధర్నా చౌక్‌లో మహాధర్నా



కళ్లకు గంతలతో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

నెహ్రూనగర్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంపుదల, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఇంజినీరింగ్ విభాగం జిల్లా కన్వీనర్ పూనేపల్లి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రవ్యాప్త నిరసనలలో భాగంగా గుంటూరు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల మహాధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, నాయకులు లలిత కుమారి, పాశం పూర్ణచంద్రరావు, కుమార్, విజయ్, కాటంరాజు, నరసింహారావు, రత్నబాబు, సుశీల పాల్గొన్నారు.

నిర్లక్ష్యం ఊబిలో ట్రాన్స్‌ఫార్మర్లు!



అగ్నిమాపక కేంద్రం వద్ద విద్యుత్ నియంత్రికకు అల్లుకున్న తీగలు



మున్సిపల్ కార్యాలయం వెనుక వీధిలో ప్రమాద స్థితిలో ట్రాన్స్‌ఫార్మర్

పొన్నూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వెనుక వీధిలో విద్యుత్ పనుల్లో నాణ్యత లోపం అడుగడుగునా దర్శనమిస్తోంది. నియంత్రికను ఏర్పాటు చేసేందుకు నిర్మించిన సిమెంటు దిమ్మెకు కాలం చెల్లిందో ఏమో.. ఒక పక్కకు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది. నియంత్రిక పడిపోకుండా ప్రస్తుతం రాళ్లు అడ్డుగా పెట్టారు. దిమ్మెకు మరమ్మతు చేయకుంటే ప్రమాదం తప్పదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పట్టణ పరిధిలో విద్యుత్ నియంత్రికలు, పోల్స్, లైన్‌ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ప్రతి నెలా రెండో శనివారం విద్యుత్ లైన్ల నిర్వహణ పేరుతో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నారు. అయినప్పటికీ విద్యుత్ నియంత్రికల నిర్వహణ మెరుగుపడడం లేదు. అగ్నిమాపక కేంద్రం వద్ద నియంత్రికకు తీగలు అల్లుకున్నాయి. వీటిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవటమే విద్యుత్ అంతరాయాలకు ప్రధాన కారణమన్న విమర్శలు వస్తున్నాయి. అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో నియంత్రికలను పరిశీలించి నిరంతరాయ సరఫరాకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల తాగునీటి కష్టాలు తీర్చాలి



అర్జీ అందిస్తున్న ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ

ప్రత్తిపాడు: పాఠశాలలో విద్యార్థుల తాగునీటి కష్టాలు తీర్చాలని పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ పోతురాజు లక్ష్మీనారాయణ అధికారులకు విన్నవించారు. మండల పరిధిలోని నడింపాలెంలో మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎంసీ చైర్మన్ చినకోండ్రుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 200 మంది విద్యార్థులు చదువుతున్నారని.. పాఠశాలకు మంచి నీటి సదుపాయం లేక పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన వాపోయారు. గ్రామ పంచాయతీ అధికారులు మంచి నీటి కుళాయి కనెక్షను పాఠశాలకు మంజూరు చేయాలని, అదే విధంగా పాఠశాలలో నీటిని పొదుపు చేసేందుకు రెండు ఇంకుడు గుంతలను కేటాయించాలని కోరుతూ ఉపాధి హామీ ఏపీవో ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి మూర్తికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ పాలెపు కుమారి తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



బోడిపాలెం(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని.. తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ కె.ఎఫ్.కెన్నడీ అన్నారు. మండలంలోని బోడిపాలెంలో మంగళవారం అంగన్‌వాడీ విద్య పూర్తి చేసుకుని ఇంటి వద్ద ఉంటున్న చిన్నారుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో లభించే మౌలిక వసతులపై ఇంటింటికీ తిరిగి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కె.విజయ్ భాస్కర్, సిబ్బంది ఉన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఓ వృద్ధురాలు అదృశ్యంపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. నగరంలోని మల్లికార్జునపేట 2వలైనకు చెందిన అన్నపూర్ణకు 70 ఏళ్లు. వయస్సు రీత్యా మానసిక స్థితి సరిగా లేక చికిత్స పొందుతోంది. గత నెల 27న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఆచూకి తెలిసిన వారు అరండల్‌పేట పోలీస్ స్టేషన్ 0863-2231955, సీఐ ఆరోగ్య రాజు 8688831 332 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

ప్రత్తిపాడు: రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట పైరు విత్తనాలను అందించనున్నామని మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణభేగం అన్నారు. మండల పరిధిలోని నడింపాలెం రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. కౌలు రైతులు ఆయా గ్రామాల్లోని వీఆర్వోలను కలిసి కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందాలన్నారు. కార్డులతో రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయని చెప్పారు. వరి పంటను సాగు చేయాలనుకునే రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను అందిస్తున్నామని.. ఆసక్తి ఉన్న రైతులు వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

చేబ్రోలు: రైతులకు వ్యవసాయశాఖ ద్వారా రాయితీపై వరి విత్తనాలను అందజేస్తున్నామని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి పి.ప్రియదర్శిని అన్నారు. చేబ్రోలు మండలం గొడవర్రు, గుండవరం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో క్షేత్ర ప్రదర్శన చేసి రైతులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. ప్రియదర్శిని మాట్లాడుతూ.. పచ్చిరొట్ట ఎరువులను రైతులు సాగు భూముల్లో పెంచడంతో భూసారం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్ఎం, ఇన్‌చార్జి సర్పంచ్, ఎస్ఎంసీ చైర్మన్

ప్రత్తిపాడు: ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని నడింపాలెం ఇన్‌చార్జి సర్పంచ్ పాలెపు కుమారి అన్నారు. ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఉదయ్‌భాస్కర్, సుధీర్, అన్నపూర్ణ, చెన్నకేశవులు, ప్రమీళ, ప్రతాప్‌రెడ్డిలకు స్థానిక పాఠశాలలో మంగళవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఇన్‌చార్జి సర్పంచ్ పాలెపు కుమారి, ఎంపీటీసీ సభ్యుడు వాసిమళ్ల మాణిక్యరావు, హెచ్ఎం జంపాల విజయ్‌కుమార్‌లు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పోతురాజు లక్ష్మీనారాయణ, గ్రామస్తులు గడ్డిపాటి పద్మారాణి, మాజీ సొసైటీ ప్రసిడెంట్ జి.సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారాకోడూరు పాఠశాలలో డీఈవో ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో ఉపాధ్యాయుడు ప్రసాద్, డీఈవో సీవీ రేణుక

చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హైస్కూల్‌లో ఎన్‌రోల్‌మెంట్ వివరాలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధనా విధానం, పనితీరు, విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రైవేటు పాఠశాలల నుంచి ఆరో తరగతిలో చేరిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు ఇచ్చే సర్వేపల్లి రాధాకృష్ణన్ మిత్రా కిట్టు పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఏపీసీ ఐ.పద్మావతి, సుజాత, హెచ్ఎం ఎం.ఏడుకొండలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నారాకోడూరు జడ్పీ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయులు కోలా ప్రసాద్ ఇరువురు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్న విషయం తెలుసుకొని డీఈవో ప్రత్యేకంగా అభినందించారు.

కళ్లం అధ్యాపకునికి డాక్టరేట్



నాగరాజును అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రత్తిపాడు: గుంటూరు రూరల్ మండలంలోని కళ్లం హరనాథరెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగం సీనియర్ ఫ్యాకల్టీ నాగరాజు పోతులకు రాయలసీమ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ రీసెర్చ్ డిగ్రీ ప్రదానం చేసినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రీసెర్చ్ డిగ్రీ 'ఏ స్టడీ ఆన్ ది పోర్ట్రేటల్ ఆఫ్ దళిత్ స్ట్రగుల్స్ ఇన్ సెలెక్టెడ్ దళిత్ షార్ట్ ఫిక్షన్' అనే అంశంపై నిర్వహించిన పరిశోధనకు గానూ డాక్టరేట్ లభించినట్లు చెప్పారు. తమ కళాశాలలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న అధ్యాపకునికి డాక్టరేట్ లభించడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎస్.బి రెడ్డి తెలిపారు. నాగరాజును కళాశాల హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసులు, కెరీర్ గైడెన్స్ విభాగాధిపతి డాక్టర్ పి.ఎల్. మాధవరావులు అభినందించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెహ్రూనగర్: నగరం, అమరావతి రాజధానిలో భాగంగా ఉన్న దృష్ట్యా అభివృద్ధి పనులు శర వేగంగా నిర్వహిస్తున్నట్లు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 18వ డివిజన్ రామనామక్షేత్రం 5వ లైన్‌లో రూ.93 లక్షలతో, 24వ డివిజన్‌లో పీకలవాగుపై రూ.28 లక్షలతో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులను నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలోని అన్ని వార్డులలో అభివృద్ధి పార్టీలకతీతంగా ప్రాధాన్య క్రమంలో పనులు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. దీనిలో భాగంగానే పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 18, 24 డివిజన్లలో రూ.1.21 కోట్లతో, స్థానిక ప్రజా ప్రతినిధుల ప్రతిపాదనలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులను నిర్మించేందుకు శంకుస్థాపన చేశామన్నారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ స్థానిక కార్పొరేటర్ల అభిప్రాయాల మేరకు, వారు ప్రతిపాదించిన ప్రాంతాలలో ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు.

వేధిస్తున్నారని వివాహిత ఫిర్యాదు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): భర్త, అత్త, మామలు మరి కొందరి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు గ్రామానికి చెందిన రామరాజు శ్రావణి, గుంటూరు వల్లూరివారితోట ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నాగసుబ్రహ్మణ్యం 2024 నవంబర్ 16న పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి భర్త, అత్త, మామ, మరిదితో పాటు మరికొందరు తనను వేధింపులకు గురి చేస్తున్నారని శ్రావణి ఫిర్యాదులో పేర్కొంది.

వడ్డీ డబ్బులు ఇవ్వలేదని ఇంటికి తాళం!

పట్నంబజారు: అధిక వడ్డీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఓ కుటుంబ నివాసానికి తాళం వేసిన ఘటన గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. పాతగుంటూరులోని శివాలయం బజారులో గోపి అనే ఆటోడ్రైవర్ కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన కార్పొరేషన్ ఉద్యోగి రాంబాబు వద్ద గత కొంతకాలం క్రితం రూ.2.50 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అయితే అప్పుకు సంబంధించి ప్రతినెలా డబ్బులు చెల్లిస్తున్నట్లు బాధితుడు తెలిపారు. ఇచ్చిన డబ్బులు సరిపోలేదంటూ రాంబాబు అసలుతో పాటు, వడ్డీ కలిపి రూ.7 లక్షలు చెల్లించాలని బాధితులను వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. గత నెల రోజుల క్రితం బాధితుల నివాసానికి తాళం వేసి ఇంట్లోవారిని బయటకు పంపారు. బాధితులు దిక్కుతోచని పరిస్థితుల్లో బంధువుల నివాసంలో ఉంటున్నారు. గతనెల 30వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధిక వడ్డీతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని, పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పాతగుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని, అయితే పూర్తి స్థాయిలో విచారిస్తున్నామని, ఎలాంటి కేసు నమోదు చేయలేదని తెలిపారు. డబ్బులు అంశం కావడంతో వారిని బయట మాట్లాడుకోవాలని సూచించినట్లు తెలిపారు. బాధితులను ఇంటికి దౌర్జన్యంగా తాళం వేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలను తక్షణమే ప్రారంభించాలని ఏబీవీపీ గుంటూరు జిల్లా సంఘటన కార్యదర్శి గురువెల్లి సాయి కోరారు. మంగళవారం ఏసీ కళాశాల కూడలిలోని కళాశాల విద్య ఆర్జేడీ కార్యాలయంలో ఆర్జేడీ కళావతికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా సాయి మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు ముగిసి మూడు నెలలైనా డిగ్రీలో ప్రవేశాలపై ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన విధానాన్ని ప్రకటించలేదని, సింగిల్, డ్యూయల్ మేజర్ అనే విషయమై కనీస స్పష్టత కరువైందని ఆరోపించారు. డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ఆన్‌లైన్‌లో ఉంటుందా లేక ఆఫ్‌లైన్ విధానంలో ఉంటుందా అనే సమాచారంపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వైఎస్సార్ సీపీ కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: మండలంలోని ములుకుదురు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నలకుర్తి సుబ్బారావు, అయోధ్య శివ నాగేశ్వరావు, కొమరగిరి గోవిందు ఇటీవల మృతిచెందారు. మంగళవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గం సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ వారి కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని మురళీకృష్ణ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ, సీనియర్ నాయకులు షేక్ నాజర్, నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాపట్ల నాగ ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కందుల శ్రీనివాసరావు, మరియా రాణి, తుపాకులు గోవర్ధన్ రావు, సాతర్ల వెంకట శివప్రసాద్, ప్రకాష్, సుశోభిత పాల్గొన్నారు.

ఆరెమండ గ్రామానికి చెందిన అంబటి బసవయ్య ఇటీవల మరణించిన విషయం తెలుసుకుని వైఎస్సార్ సీపీ నియోజకవర్గం సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అప్పారావు, యూత్ విభాగం అధ్యక్షులు చుండూరు వీరయ్య, సంగమేశ్వరరావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు తిలోదకాలు!



ఎస్వీబీ రోడ్డులో దిగుమతికి మలుపు తిరుగుతున్న లారీ

పొన్నూరు: పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. పోలీసులు, మున్సిపల్ అధికారులు ఇచ్చిన ఆదేశాలను కొందరు బేఖాతరు చేస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టినా పట్టించుకోవడం లేదు. సాయంత్రం 4 గంటల తరువాత లారీలు ప్రధాన మార్గాల్లోకి రాకూడదని పలు నిబంధనలు ఉన్నాయి. కానీ వాటిని పలు షాపు యజమానులు, లారీ డ్రైవర్లు పట్టించుకోవడం లేదు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు కూడా ఎస్వీబీ రోడ్డులో భారీ వాహనం దిగుమతి కోసం ప్రధాన వీధుల్లోకి వచ్చింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని.. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఏఐ ఫర్ ఏపీ హ్యాకథాన్ 2025 రన్నరప్‌గా క్వాడ్రిక్ ఐటీ



క్వాడ్రిక్ ఐటీ టీంకు అవార్డు అందిస్తున్న ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

ప్రత్తిపాడు: ప్రజల భద్రత కోసం పాత పద్ధతులను పక్కనబెట్టి, సాంకేతికతతో కొత్త మార్గాలను అన్వేషించి బ్లూక్వెరీ అనే కొత్త ప్లాట్ ఫాంను అభివృద్ధి చేసి క్వాడ్రిక్ ఐటీ బృందం రన్నరప్‌గా నిలిచింది. గత నెల 27, 28, 29 తేదీల్లో గుంటూరు రూరల్ మండలం చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఏఐ ఫర్ ఆంధ్ర పోలీస్ హ్యాకథాన్ 2025లో పాల్గొన్న క్వాడ్రిక్ ఐటీ టీం తమ సాంకేతిక ఆలోచనలకు పదును పెట్టి విప్లవాత్మకమైన ప్లాట్‌ఫాంను డెవలప్ చేసింది. ఈ ప్లాట్‌ఫాం 'మన పోలీస్ సిబ్బంది కాంప్లెక్స్ సిస్టమ్‌లను తక్కువ సమయంలో, సులభంగా అర్థం చేసుకునేలా ఉండాలని, అందుకోసం మేము బ్లూక్వెరీని రూపొందించామని, ఇది వాయిస్ కమాండ్స్‌తో పని చేస్తూ, ఇంగ్లీష్, తెలుగు భాషల్లో డేటాను తేలికగా అందిస్తుందని' బృంద సభ్యుడు సుజయ్ అనిశెట్టి తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును 4 సైట్ ఏఐ సీఈవో సూర్య.కె, ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఎస్పీ తుషార్ డుడి, ఐజీ చందు శ్రీకాంత్, డా. కొల్ల శ్రీనివాస్‌లు క్వాడ్రిక్ ఐటీ బృందానికి అందజేశారు. క్వాడ్రిక్ ఐటీ సుజయ్ అనిశెట్టి, సాయి అజిత్ భవరాజు బృందాన్ని ఏర్పాటు చేయగా, వారికి పరిశ్రమ నిపుణులైన రఘు టీ, కేసరి సాయి సబ్‌నీసు, కమల్ చంద్ కోతా, ప్రియతమ్ తటవర్తిలు మార్గదర్శకులుగా నిలిచారు.

వర్మీ ఎరువుతో భూమి సారవంతం

ప్రత్తిపాడు: వర్మీ కంపోస్టు ఎరువుతో భూమి సారవంతంగా మారి మొక్కల పెరుగుదలకు ఉపకరిస్తుందని డీఎల్‌పీవో కె.శ్రీనివాసరావు అన్నారు. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం సుప్రీం ఎల్‌టీసీ, ప్రత్తిపాడు ఎస్‌డబ్ల్యూపీసీల్లో తయారు చేసిన వర్మీ కంపోస్టు ఎరువును విక్రయించేందుకు ప్రత్తిపాడులో మంగళవారం 'రైతన్న నేస్తం' పేరుతో వర్మీ అమ్మకం స్టాల్‌ను ఏర్పాటుచేశారు. పంచాయతీ కార్యాలయం సమీపంలో మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన స్టాల్‌ను ముఖ్య అతిథిగా హాజరైన డీఎల్‌పీవో శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రత్తిపాడు బ్రాంచ్ (07084), ప్రత్తిపాడు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522019

(APPENDIX-IV) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002) లోని రూల్ 8(1) ప్రకారం

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రత్తిపాడు బ్రాంచ్, ప్రత్తిపాడు, గుంటూరు జిల్లా యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 సందరి సెక్షన్ 13(2)కు అనుబంధమైన రూలు 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత(లు): శ్రీ అలపాటి వెంకట కృష్ణయ్య (ఋణగ్రహీత)**, తండ్రి : వీరయ్య, డోర్ నెం.8-11, గొట్టిపాడు గ్రామం, ప్రత్తిపాడు మండలం, గుంటూరు జిల్లా - 522019. **శ్రీమతి అలపాటి నాగ మల్లేశ్వరి (సహ-ఋణగ్రహీత)**, భర్త : వెంకట నరసయ్య, డోర్ నెం.8-11, గొట్టిపాడు గ్రామం, ప్రత్తిపాడు మండలం, గుంటూరు జిల్లా - 522019 వారు **ఎబిఎల్ అకౌంట్ నెం.38099075254 నకు** చెల్లించవలసిన బకాయి **తేది:15-04-2025** నాటికి **రూ.11,51,633/-** (అక్షరాల పదకొండు లక్షల యాభై ఒక్క వేల ఆరు వందల ముప్పై మూడు రూపాయలు మాత్రమే) + ఒప్పంద రేటు ప్రకారం తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులతో కలిపి నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.15-04-2025**న డిమాండ్ నోటీసు జారీ చేయబడినది.

ఋణగ్రహీతలు మరియు హామీదారు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్స్ సందరి రూలు 8 ప్రకారము దిగువ పేర్కొన్న ఆస్తిని **తేది. 26-06-2025**న స్వాధీనత తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా **తేది: 15-04-2025** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.11,51,633/-** (అక్షరాల పదకొండు లక్షల యాభై ఒక్క వేల ఆరు వందల ముప్పై మూడు రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రత్తిపాడు బ్రాంచ్, ప్రత్తిపాడు, గుంటూరు జిల్లా** వారి ఛార్జీకి లోబడి వుండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు/చట్టబద్ధ వారసులు/హామీదారులు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకొనుటకై శ్రద్ధ వహించవలెను.

స్థిరాస్తి వివరములు

గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్-డిస్ట్రిక్ట్, ప్రత్తిపాడు మండలం, గొట్టిపాడు గ్రామం, గొట్టిపాడు గ్రామ డి.నెం.203, డోర్ నెం.2-9, అసెస్మెంట్ నెం.209, పాత అసెస్మెంట్ నెం.212 లోని 192 చ.గ.లు లేదా 160.53 చ.మీ.ల విస్తీర్ణం గల స్థలం అందు నిర్మించిన గాల్వాల్యూమ్ షీట్ రూఫ్డ్ షెడ్ యావత్తు ఆస్తి రిజిష్టర్డు గిఫ్ట్ డీడ్ డాక్యుమెంట్ నెం.973/2018, తేది.20.03.2018 ప్రకారం శ్రీమతి అలపాటి నాగ మల్లేశ్వరి, భర్త: వెంకట కృష్ణయ్య గారికి చెందినది. **హద్దులు: తూర్పు** : శ్రీ సీతా రామాంజనేయ స్వామి గుడి - 45'.00", **దక్షిణం** : గొట్టిపాడు నుండి ఉన్నవ వైపు పోవు రోడ్డు - 36'.00", **పడమర**: అలపాటి వెంకట కృష్ణయ్య - 55'.00", **ఉత్తరం** : సాదినేని సుబ్బారావు - 33'.00".

తేది : 26-06-2025 | సం/- అధీకృత అధికారి
ప్రదేశం : ప్రత్తిపాడు | స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com